



కామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కామారెడ్డి టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా న్యాయాధికారి వరప్రసాద్, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ దగ్గరి నుంచి కళాభారతి ఆడిటోరియం వరకు అన్ని విద్యా సంస్థల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి, యువత యాంటి డ్రగ్ సోల్జర్‌గా మారి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై సమాజంలో అందరికి అవగాహన కల్పించాలని తెలిపారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని తెలంగాణ స్టేట్ యాంటి నార్కోటిక్ బ్యూరో టోల్‌ఫ్రీ నెంబర్ 1908/14446కి లేదా ఎక్సైజ్ వారి టోల్ నెంబర్ 18004252523కి లేదా డయల్ 100కు సమాచారం చేరవేయాలని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు చదువుపై దృష్టిపెడితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. అనంతరం ఎస్పీ రాజేష్‌చంద్ర మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమై డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దామని పిలుపునిచ్చారు. అదేవిధంగా యువత, విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి బానిసలుగా మారుతున్నారని వారి తల్లిదండ్రులకు, బయట చెప్పుకోలేని మనోవేదనకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయాధికారి నాగరాణి, అదనపు కలెక్టర్ విక్టర్, ఏఎస్పీ నరసింహారెడ్డి, చైతన్యారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా చూస్తాం

బిచ్కుంద, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన మున్సిపాలిటీ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ సందర్శించి కమిషనర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ పట్టణ పరిధిలోని ప్రధానమైన సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు అనుమతి పొందిన లబ్ధిదారుడికి కాకుండా పక్కదారి పడుతున్నట్లు తన దృష్టికి వచ్చినట్లు రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేసి పూర్తిగా కట్టడి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ హయ్యూమ్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్నూర్‌లోని సలాబత్‌పూర్ ఆర్టీఏ చెక్‌పోస్టు





సలాబత్‌పూర్ ఆర్టీఏ చెక్‌పోస్టులో వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ అధికారులు

ఆర్టీఏ చెక్‌పోస్టులు..

వసూళ్లకు అడ్డాలు!

- జిల్లాలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుతో పాటు ఒక చెక్ పాయింట్
- జిల్లా సరిహద్దుల్లోని సలాబత్‌పూర్ చెక్‌పోస్టులో అక్రమ వసూళ్లు
- ఏసీబీ దాడితో బయటపడ్డ వసూళ్ల దందా
- లెక్కలో లేని రూ.91 వేలను జప్తు చేసిన ఏసీబీ
- నిబంధనలకు విరుద్ధంగా నడిచే వాహనాల నుంచి వసూళ్లు
- ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకుని దందా సాగిస్తున్న సిబ్బంది
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- చెక్‌పోస్టులో డ్యూటీల కోసం అధికారులు, సిబ్బంది పోటీ

కామారెడ్డి, జూన్ 26(ఆంధ్రజ్యోతి) / మద్నూర్ : జిల్లాలోని మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులు అవినీతికి అడ్డాగా మారాయి. ఆర్‌టీఏ చెక్‌పోస్టుతో పాటు ఎక్సైజ్, వ్యవసాయ చెక్‌పోస్టులు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా ఆర్టీఏ చెక్‌పోస్టుల వద్ద అక్రమ వసూళ్ల దందా కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా ఏసీబీ అధికారులు సలాబత్‌పూర్ చెక్‌పోస్టు వద్ద అర్ధరాత్రి ఆకస్మిక దాడులు చేసి పెద్ద మొత్తంలోనే లెక్కలో లేని నగదును జప్తు చేయడం అక్రమ వసూళ్లకు నిదర్శనం. సలాబత్‌పూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టే కాకుండా జిల్లాలోని పొందుర్తి ఆర్టీఏ చెక్ పాయింట్‌లోనూ అక్రమ వసూళ్లు చేపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ చెక్‌పోస్టులలో ఉన్న సిబ్బంది అక్రమ వసూళ్ల దందా సాగిస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించే వాహనాలకు జరిమానా విధించి ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాల్సి ఉండగా జరిమానా విధించకుండా అక్రమంగా వసూళ్లు చేసిన డబ్బులు జేబుల్లో నింపుకుంటున్నారు. ఇలా నిత్యం రూ.లక్షలు చేతులు మారుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేకపోయారు. ఈ వ్యవహారంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండి పడుతోంది.

చెక్‌పోస్టుల వద్ద ప్రైవేట్ వ్యక్తుల దందా

జిల్లాలోని మద్నూర్ మండలంలో గల 161వ జాతీయ రహదారిపై సలాబత్‌పూర్ అంతర్రాష్ట్ర ఆర్టీఏ చెక్‌పోస్టు ఉండగా భిక్కనూరు మండలంలోని పొందుర్తి వద్ద ఆర్టీఏ చెక్‌పాయింట్ ఉన్నాయి. ఈ చెక్‌పోస్టుల వద్ద డ్యూటీ కోసం రవాణా శాఖ సిబ్బంది పోటీ పడుతారనే చర్చ ఉంది. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది కొంతమంది ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకుని వారి ఆధ్వర్యంలోనే వసూళ్ల దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఏదైన వాహనం సరిహద్దు నుంచి లోపలికి రావాలన్నా సరిహద్దు దాటి బయటకు వెళ్లాలన్నా అధికారులకు ముడుపులు ఇవ్వాల్సిందేననే చర్చ సాగుతోంది. ట్యాక్సీ ప్లేట్లు హెవీలోడ్‌తో వాహనాలు వస్తున్నాయంటే సదరు అధికారులకు పండుగే. అధిక లోడ్‌తో వచ్చే నిబంధనలకు విరుద్ధంగా నడిచే వాహనాలను అధికారులు నిలిపి తనిఖీ పేరుతో పక్కన ఉండమంటూ ఆ తర్వాత అక్కడే ఉండే ప్రైవేట్ వ్యక్తులు సదరు వాహనదారుల వద్దకు వచ్చి బేరం మాట్లాడి సయోధ్య కుదుర్చుతుంటారు. ఇలా నిత్యం ఒక్కో చెక్‌పోస్టు నుంచి రూ.1.50 లక్షల నుంచి 2 లక్షల వరకు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

హెవీ లోడ్‌తో వచ్చి పోతున్న వాహనాలు

ముడుపుల బాగోతం కారణంగా చెక్‌పోస్టు వద్ద అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో పొరుగు రాష్ట్రాల నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా భారీ లోడ్లతో వాహనాలు వస్తూ పోతున్నాయి. అంతే కాకుండా మాదకద్రవ్యాలను సైతం అక్రమార్కులు స్మగ్లింగ్ చేస్తున్నారు. మద్నూర్ సలాబత్‌పూర్ ఆర్టీఏ చెక్‌పోస్టు, భిక్కనూరులోని పొందుర్తి ఆర్టీఏ చెక్‌పాయింట్ నుంచి ప్రతీరోజు వందల సంఖ్యలో భారీ వాహనాలు వస్తూ పోతుంటాయి. ఈ చెక్‌పోస్టుల గుండా ఎక్కువగా భారీ లోడ్లతో ఐరన్, సిమెంట్, ఇసుక, ఎలక్ట్రానిక్ సరుకులు, ప్లాస్టిక్ వస్తువులు, పప్పు దినుసుల వాహనాలు పోతుంటాయి. ఆరు టైర్లు, పది టైర్లు, పద్నాలుగు, పదహారు టైర్ల వాహనాలు నిబంధనల ప్రకారం 10 నుంచి 35 టన్నుల వరకు సరుకులు రవాణా చేయ వచ్చు. కానీ అందుకు భిన్నంగా లారీల్లో 5 నుంచి 25 టన్నుల అదనపు లోడ్‌తో భారీ వాహనాలు వెళ్తు వస్తున్నాయి. అలాగే పర్మిట్, ఫిట్‌నెస్ లేని వాహనాలు నిత్యం వచ్చి పోతున్నాయి. అధికారులు మాత్రం కొన్ని వాహనాలకు జరిమానాలు విధించకుండా ముడుపులు తీసుకుని పంపిస్తుండగా మరికొన్ని వాహనాలకు తక్కువ జరిమానాలు విధించి కొంత మొత్తాన్ని జేబుల్లో వేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంతటి ముడుపుల బాగోత ంలో మాదకద్రవ్యాలు, గంజాయి లాంటివి సరిహద్దు లు దాటి జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.


నిబంధనలకు పాతర

అంతర్రాష్ట్రాల నుంచి జాతీయ రహదారి గుండా

(మిగతా 8వ పేజీలో)



భిక్కనూరులోని పొందుర్తి వద్ద ఆర్టీఏ చెక్ పాయింట్



నిజాంసాగర్‌లోకి వరద

- ప్రాజెక్టులో పెరుగుతున్న నీటి సామర్థ్యం
- ప్రస్తుతం నిజాంసాగర్‌లో 5.203 టీఎంసీల నీటి నిల్వ
- మంజీరా వెంట 1,025 క్యూసెక్కుల నీరు రాక
- చిగురిస్తున్న రైతుల ఆశలు

7

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆటలు

- జిల్లాలోని గ్రామాలు, తండాల్లో కప్పతల్లి ఆటలు
- వర్షాలు కురవాలని కప్పతల్లిపై నీళ్లు పోస్తూ మొక్కుతున్న ప్రజలు

7

ఇంటి నిర్మాణం.. పెను భారం!

- నిర్మాణ సామగ్రి ధరలు పైపైకి
- ధరలు పెరగడంతో ఆందోళన చెందుతున్న నిర్మాణదారులు





పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో రాజు

నేషనల్ స్టూడెంట్ పర్యావరణ కాంపిటేషన్ పోస్టర్ల ఆవిష్కరణ

కామారెడ్డి టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ కాంపిటేషన్ పోస్టర్లను డీఈవో రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావాల నుంచి రక్షణ కోసం విద్యార్థుల్లో పర్యావరణ నైపుణ్యాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవడం అత్యంత అవసరమని, మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, వ్యర్థాలు వేరు చేయడం వంటి పద్ధతులు ప్రతీ విద్యార్థికి అలవాటు కావాలని తెలిపారు. హరిత్, దవే ఆఫ్‌లైన్ అనే నినాదంతో పర్యావరణ సంరక్షణ అనే ఉద్దేశ్యంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు రిజిస్ట్రేషన్లు అందుబాటులో ఉంటాయని, కేంద్ర, విద్యా, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహకారంతో ఈ పోటీని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఫలితాలు ఆగస్టు 30న విడుదల చేస్తామన్నారు. 1 నుంచి 5వ తరగతి, 6 నుంచి 8వ తరగతి, 9 నుంచి 12వ తరగతి, డిగ్రీ, పీజీ, పరిశోధన విద్యార్థులు, ఇతరులు పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈసీఓ మిత్రమ్.యాప్ అనే మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ హరిత ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ విద్యాసాగర్, జిల్లా విద్యాశాఖ కో ఆర్డినేటర్లు వేణుగోపాల్‌శర్మ, నాగవేందర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

బడిబాటలో 13,214 ప్రవేశాలు

కామారెడ్డి టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు 13,214 కొత్తగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారని డీఈవో రాజు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో తల్లిదండ్రులను మోటివేట్ చేసి వివిధ స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ కార్యకర్తల సహకారంతో 1వ తరగతిలో 4,385, ప్రైవేట్ పాఠశాలల నుంచి 4,120 కొత్త అడ్మిషన్లు, ప్రభుత్వ పాఠశాలల నుంచి 4,709 కొత్తగా అడ్మిషన్లు వచ్చాయన్నారు. అన్ని గ్రామాల్లో గ్రామపెద్దలు, ఉపాధ్యాయులకు సహాయ సహకారాలు అందించి ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం చేసేందుకు సహకరించాలని కోరారు.

జిల్లాలో మోస్తరు వర్షం

- పలు మండలాల్లో కురిసిన వాన
- రైతుల్లో చిగురించిన ఆశలు
- వరుణుడు కరుణించడంతో వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ బిజీ



కామారెడ్డిలో కురుస్తున్న వర్షం

కామారెడ్డి టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా వర్షాలు అంతంత మాత్రంగానే ఉండడంతో ఒక వైపు రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజుల నుంచి వాతావరణం చల్లబడినా అక్కడక్కడ మాత్రమే చినుకులు పడ్డాయి. ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు స్థాయి వర్షం కురియడం, వానాకాలం సీజన్‌లో వేసే పంటలకు కలిసి రానుండడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. వరుణిడి కరుణ కోసం ఎదురు చూస్తున్న రైతులకు జిల్లాలో కురుస్తున్న మోస్తరు వర్షాలతో వ్యవసాయ పనులు మరింత ముమ్మరం చేసేందుకు సిద్ధమవుతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. కామారెడ్డితో పాటు గత కొద్ది రోజుల నుంచి ఆయా మండలాల్లో వర్షం కురియడంతో వ్యవసాయ పనులు ఊపందుకొనున్నాయి. రైతులకు ఈ వర్షం ఎంతో ఊరటను ఇచ్చినట్లయింది. వర్షంతో ఆయా ప్రాంతాలు చిత్తడిగా మారాయి.

రైతులకు ఆనందం తెచ్చిన వర్షం

ఈ వానాకాలం సీజన్ మే నెల చివరి వారంలో ప్రారంభమైనప్పటికీ కొద్ది రోజులు వర్షాలు పడి ఊసురుమనిపించాయి. ఆ తర్వాత అంతగా పెద్దవానలు ఏమి లేవు. గత రెండు రోజులుగా వాతావరణం చల్లబడడంతో ఆరుతడి పంటలు వేసి రైతుల్లో ఆనందం చిగురిస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి డబ్బులు జమ చేయడంతో రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తూ బిజీగా మారారు. పలుచోట్ల నాట్లు వేసేందుకు సిద్ధమవ్వగా వర్షాలు కురవకపోవడంతో ఒకింత ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం పడుతున్న వర్షాలతో పాటు భారీ వర్షాలు కురిస్తే చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చి చేరితే ఈ ఏడాది పంటలకు డోకా ఉండదని రైతులు పేర్కొంటున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్‌షెట్కార్



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ నూతన కార్యవర్గ సభ్యులు

మాచారెడ్డి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వీర హనుమాన్, వేంకటేశ్వర ఆలయం చాలా పురాతనమైందని ఎంతో మహిమ కలదని ఈ ఆలయ అభివృద్ధికి తమ వంతు శాయశక్తుల కృషి చేస్తామని ఎంపీ సురేష్‌షెట్కార్, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. గురువారం ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఏఐసీసీ సెక్రెటరీ విష్ణునాథన్‌తో కలిసి హాజరై మాట్లాడారు. ఆలయ కమిటీ సభ్యులు నిజాయితీగా స్వామి వారి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని, మీకు ఈ అవకాశం దొరకడం చాలా గొప్ప విషయమని, స్వామి వారి కరుణతోనే మీకు ఈ పదవులు వచ్చాయని దానిని అభివృద్ధితో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఆలయంలో భక్తులు కోరిన కోర్కెలు నెరవేరుతాయని, ఆలయ దర్శనం చేసుకుంటే మనసు ఎంతో ప్రశాంతంగా ఉంటుందన్నారు. అనంతరం పాలకవర్గం సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ మేరకు ఎంపీ, ప్రభుత్వ సలహాదారుడు, ఏఐసీసీ సెక్రెటరీని వారు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమ అనంతరం కామారెడ్డి నియోజకవర్గంలోని మాచారెడ్డి మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ అభివృద్ధికి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ సీట్లు వచ్చేలా ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని, పార్టీ కోసం పని చేసిన వారికి పదవులు వాటంతట అవే వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, ఆయా మండలాల మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో సముచిత స్థానం దక్కడం లేదు

- కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సీడీసీ చైర్మన్ ప్రకటన



ఇర్షాద్

సదాశివనగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ సీడీసీ చైర్మన్ మహ్మద్ ఇర్షాద్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. రాజీనామా లేఖను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు అందజేసినట్లు సమాచారం. ఈ మేరకు ఆయన రాజీనామా లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. గతంలో బీ ఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తనకు కోఆప్షన్ పదవి ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉండలేక ఐదు సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరి క్రియాశీలకంగా పూర్తి బాధ్యతలు పైన వేసుకుని కష్టపడి పని చేశానని వివరించారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న తనను బీఆర్ఎస్ పార్టీ అనేక ఇబ్బందులకు గురి చేసిందని, తనపై లేనిపోని కేసుల కూడా పెట్టించినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎన్ని ఇబ్బందులు పెట్టినప్పటికీ మీ కోసం అనేక మందితో కొట్లాడుతూ పార్టీ పటిష్టను పెంచడానికి కృషి చేశానన్నారు. అడుగడుగునా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ మీరు ఎమ్మెల్యేగా గెలువడానికి శాయశక్తులా కృషి చేశామన్నారు. ఇంత చేసినా తనకు ప్రస్తుతం పార్టీలో సముచిత స్థానం దక్కడం లేదని, పార్టీ ద్రోహులకు, మీపైనే విమర్శలు చేసిన వ్యక్తులకు ఉన్నత పదవులు కట్టబెడుతూ తనను అవమాన పరుస్తున్నందుకు కలత చెంది రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. తన రాజీనామా వల్ల మీకు ఏ మాత్రం ఇబ్బంది కలిగినా క్షమించాలని, తన రాజీనామాను ఆమోదించాలని కోరారు.

కేంద్ర మంత్రి సమక్షంలో బీజేపీలో చేరిక



మునిపల్లి అనంత్‌రెడ్డి బీజేపీలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

జక్రాన్‌పల్లి, జూన్26 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో జక్రాన్‌పల్లి మాజీ ఎంపీపీ మునిపల్లి కే. అనంత్‌రెడ్డి బీజేపీలో చేరారు. గురువారం నిజామాబాద్‌లో బీజేపీ పార్టీ కార్యాలయంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పార్టీ కండువా కప్పి అనంత్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనంత్‌రెడ్డి మాట్లాడుతూ జక్రాన్‌పల్లి మండలంలో పార్టీ బలోపేతానికి తనవంతు అన్ని విధాలుగాకృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, బీజేపీ నాయకులు వంశీగౌడ్, శ్రీనివాస్ గౌడ్, బొజ్జ సంజీవ్‌గౌడ్, క్యాతం రాజారెడ్డి, విక్రం పటేల్, పోగుల భాస్కర్, కృష్ణ, శ్రీధర్, గంగారెడ్డి, నవీన్, సంతోష్, కొలిప్యాక సాయిరెడ్డి,పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో పసుపు రైతులకు ఆహ్వానం



రైతులను అమిత్‌షా సమావేశానికి రావాలని ఆహ్వానిస్తున్న కోటపాటి

మోర్తాడ్ , జూన్26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నెల 29న జాతీయ పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించడానికి విచ్చేస్తున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మహాసభకు పసుపు రైతులు తరలి రావాలని మోర్తాడ్ రైతులను పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు, బీజేపీ సీనియర్ నాయకుడు బద్దం లింగారెడ్డి, కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు పి. తిరుపతిరెడ్డి రైతుల ను ఆహ్వానించారు. అమిత్‌షా బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల రైతులను కోరారు. గురువారం మండల కేంద్రంలోని తక్కూరివాడ, బద్దంవాడ, ఎలా ల వాడ, మున్నూర్‌వాడ రైతు సంఘాలను వారు ఆహ్వానించారు. పార్టీలకు అతీ తంగా రైతులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు మహిపాల్, శ్రావణ్, రంజీత్, జైడి చిన్నారెడ్డి, లింగాపురం నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

చందూర్ ప్రభుత్వ పాఠశాల తనిఖీ



అధ్యాపకులకు సూచనలిస్తున్న బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్‌మహతో

మోస్రా,జూన్26(ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను గురువారం రోజు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల యొక్క సామర్థ్యాలు ఏ విధంగా ఉన్నాయని వారితో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ ఏడాదిలో జరిగే విద్యార్థుల పరీక్ష ప్రతిభలో సెమిటెస్ట్, మిడ్ టెస్ట్, ఫైనల్ టెస్ట్‌లలో అంచెలంచెలుగా విద్యార్థుల ప్రతిభ మెరుగుపడాలని సూచించారు. ప్రారంభ పరీక్ష ప్రశ్న పత్రాన్ని పరిశీలించారు. విద్యార్థుల యొక్క సామర్థ్యాలను తెలంగాణ విద్యాశాఖ యాపులో పొందుపరిచాలని సూచించారు. గత సంవత్సరం విద్యార్థుల యొక్క ప్రగతి రికార్డ్‌ను పరిశీలించారు. విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ వహించాలని అధ్యాపక బృందానికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్ టౌన్, జూన్26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో చేపట్టిన పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వందరోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 3, 17వ వార్డులలో జేసీబీ సహాయంతో పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజు పరిశీలించి సీజన్‌వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, డ్రైనేజీలలో చెత్తాచెదారం పారివేయద్దని మున్సిపల్ ట్రాక్టర్‌కు అందజేయాలని సూచించారు. ఆయన వెంట పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్లు దినేష్, చక్రధర్, సానిటర్ జవాన్లు భాజన్న, శంకర్ పాల్గొన్నారు.

రామన్నపేట్‌లో సాహోమహరాజ్ జయంతి

వేల్పూర్, జూన్26 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామంలో ఛత్రపతి సాహోమహరాజ్ జయంతి వేడుకలను గురువారం షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి సాహోమహరాజ్ చిత్రపటానికి సంఘం అధ్యక్షుడు జాంబవ చామర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్య క్షుడు వినోద్, సభ్యులు పాల్గొన్నారు.

'టీయూలో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలి'

డిచ్‌పల్లి,జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీచేయాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రఘురాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వర్సిటీలో కార్యకర్తల సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పూర్తిగా ప్రక్షలన చేయాలని వర్సిటీలకు స్వయంప్రతిపత్తి కాపాడాలని వర్సిటీల అభివృద్ధి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావే శంలో వర్సిటీ కన్వీనర్ అజయ్, చందు, అజయ్, నవీన్, విశాల్ పాల్గొన్నారు.

సుంకెట్ తండా పాఠశాలలో టై, బెల్టుల వితరణ

మోర్తాడ్ , జూన్26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకెట్ గ్రామ పంచాయతీ పరిధిలో గల గిరిజన తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రూ.1500 విలువ గల టై, బెల్టులను టీఎస్‌యూపీఎఫ్ మండల అధ్యక్షుడు, ప్రధానోపాధ్యాయులు దండు గంగాధర్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు ఎం.నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో టూకే రన్‌లో పాల్గొన్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి



మోతె పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వేల్పూర్ ఎస్సై సంజీవ్



బోధన్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ దృశ్యం

మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలి

ఆర్మూర్ టౌన్, జూన్26 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వల్ల జీవితాలు నాశనం అవుతున్నాయని ప్రతీ ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి మామిడిపల్లి చౌరస్తా వరకు టూకేరన్ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల గురించి అవగాహన కల్పించారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, దేశంలో యువత పాత్ర కీలకమైందని డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాన్ని చేరుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లల పనితీరుపై ఎప్పటికప్పుడు పరిశీలిస్తు జాగ్రత్తలు తెలుపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, మోటర్ వెకిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి, ఎక్సైజ్ సీఐ అంజిత్‌రావ్, సీడీపీవో, సూపర్ వైజర్, హెచ్ఎం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● జడ్పీహెచ్ఎస్ పెర్కిట్ పాఠశాలలో

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మద్దికుంట శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధక ర్యాలీని నిర్వహించి పాఠశాలలో విద్యార్థులు సేనో డ్రగ్స్ అనే అక్షరాలతో అవగాహన కల్పించారు.ఈ సందర్భగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంత్ రావు,వెంకటరమణచారి, పోశన్న,లక్ష్మణ్,బాజన్న, తది తరులు పాల్గొన్నారు.

కోటగిరి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోటగిరి ఎస్ఐ సునీల్ సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల నుండి పాత బస్టాండ్ వరకు విద్యార్థులచేత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు. మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్‌లు వాహనాలు నడిపితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల లెక్చరర్లు అనిల్, దత్తాత్రి, రాము, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్:మత్తు పదార్థాల వినియోగం వల్ల ఎంతో మంది జీవితాలు నాశనం అవుతున్నాయని,ప్రజలుమత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై రజనీకాంత్ అన్నారు.గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా ముప్కాల్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ నుంచి బైపాస్ రోడ్డు వరకు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ,సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: యువత, విద్యార్థులు చెడుమార్గంలో నడవకుండా మంచి మార్గంలో నడుస్తు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఎండి మాలిక్‌రహ్మాన్ అన్నారు.గురువారం జక్రాన్‌పల్లిలో విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మత్తు పదార్థాలు, డ్రగ్స్ నియంత్రణ, మాదకద్రవ్యాలు, గంజాయి, సైబర్‌నేరాలు, ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు పోలీస్‌లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై, హెచ్ఎం ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్‌లు పాల్గొన్నారు.

మోస్రా: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల మోస్రా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాభివృద్ధి అధికారి నాగనాథ్, కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు బాలాజీ రావు, వైద్య అధికారి విజయ్ కుమార్, ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ మహేష్, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: మండల కేంద్రంలో గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, డ్రగ్స్‌కు నిర్మూనకు కృషి చేయాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయడంలో యువకుల పాత్ర కీలకమని, చెడు వ్యసనాలు అటువాటు చేసుకోవద్దన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు, ఉపాధ్యాయులు గంగాధర్, ఏఎస్ఐ గంగాప్రసాద్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి:డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యాల పట్ల నేటి యువత దూరంగా ఉండాలని ఎస్సై సందీప్ అన్నారు. గురువారం మండలంలోని మాక్లూర్ తండా ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పందీప్, ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: డ్రగ్స్, గంజాయి, వైట్నర్‌లాంటి మత్తు పదార్థాలు ఆరోగ్యానికి హానకరమని విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ వేణు మాదవ్ తెలిపారు. పట్టణ కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ వేణుమాదవ్ మత్తు పదార్థాలు సేవించడం వల్ల శరీరంలోని మెదడు దెబ్బతిని అవయవాలు పనిచేకుండా పోయి పక్షవాతం వచ్చే అవకాశం ఉంటుందని వీటికి దూరంగా ఉండాలని సూచించారు. అంతకుముందు ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో 5 కేరన్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, డాక్టర్ అజయ్‌పవర్, సీడీపీవో స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులచే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ డి. పెద్దన్న ప్రతిజ్ఞ చేయించారు.విద్యార్థులు డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మఠిపల్లి భూపతి, రాజయ్య, దశరథ, అర్చన, అధ్యాపక విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ , ఎంఈవో బట్టు రాజేశ్వర్‌లు మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిస కావద్దని మాదక ద్రవ్యాలు ఆరోగ్యాన్ని పాడుచేయడమే కాకుండా మనిషిలోని సామర్థ్యాలను నశింపజేస్తాయి వారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలో గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా నుండి బోధన్ బస్టాండ్ మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బోధన్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వద్దు, జీవితమే ముద్దు అని పేర్కొన్నారు. యువత డ్రగ్స్‌కు బానిసలు కావద్దని, జీవితాన్ని వెలుగు బాటలో నడిపించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో పద్మ, సీఐలు వెంకట నారాయణ, విజయ్ బాబు, ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు, విద్యావికాస్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, సంఘ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్:మండలంలోని పడిగెల్, వేల్పూర్, మోతె, అంక్సాపూర్ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, అక్రమ రవాణాలకు వ్యతిరేకంగా గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా గ్రామాల యువకులు టూకేరన్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సంజీవ్ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజన్న, వైద్య గణేష్, మల్లేశ్వరి, పీఆర్‌టీయు ప్రధాన కార్యదర్శి నర్సింహరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాక్లూర్:మాదక ద్రవ్యాలు మానవ శరీరానికి హాని కల్పించే పదార్థాలని వీటి వాడకం ప్రమాదకరమని విద్యార్థులు వాటికి దూరంగా ఉం డాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటి కమీషనర్ సోమిరెడ్డి అన్నారు. మండలంలోని విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాల దుర్వినియోగం పై ఇంజనీరింగ్, ఫార్మసి, పాలిటెక్నిక్ విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి, సెక్రటరీ అమృతలత, ప్రిన్సిపాల్ గణేష్, సురేష్, ఎస్సై సిబ్బంది , అధ్యపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

మెండోరా: మండలంలోని వెల్కటూర్ నడిమి తండాలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆర్మూర్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు, ఎన్సిల్లు, ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యుడు ప్రభాకర్, అంగన్‌వాడి టీచర్ సునీత, ఎక్సైజ్‌శాఖ అధికారులు, గ్రామ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ:మాదక ద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలని సిరికొండ ఎస్సైరామ్ కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన మరియు అక్రమ రవాణ వ్యతిరేక దినో త్సవం సందర్భంగా సిరికొండలో విద్యార్థులతో కలిసి పోలీసుసిబ్బంది ర్యాలీ నిర్వహించారు.ఈకార్యక్రమంలో హెచ్ఎం నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారు బోల్తా : ఆరుగురికి స్వల్ప గాయాలు

రెంజల్,జూన్26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాటాపూర్ గ్రామం వద్ద బుధవారం అర్ధరాత్రి సమయంలో కారుబోల్తా పడింది. నిజామాబాద్‌కు చెందిన కుటుంబ సభ్యులు సాటాపూర్‌లోని సౌమ్య గార్డెన్‌లో శుభకార్యానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్లే సమయంలో భారీ వర్షం కారణంగా వాహనం సాటాపూర్ చౌరస్తా వద్ద బోల్తా పడింది. డ్రైవర్‌తో పాటు ఐదుగురు ప్రయాణించడంతో వారికి స్వల్ప గాయాలైనట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. అర్ధరాత్రి సమయంలో అధిక వర్షం కురవడం వల్ల కారు అదుపు చేసే క్రమంలో బోల్తా పడినట్లు కుటుంబ సభ్యులు సర్ఫరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువు నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలి

కోటగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చెరువు నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. పొతంగల్ మండల కేంద్రంలోని గ్రామ దేవతల ఆలయంలో గురువారం రైతులు చెరువు నీటి యాజమాన్యంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఖరీఫ్ పంట కొరకు నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. చెరువులు, కాలువల మరమ్మతు పనులను చేపట్టాలని పలువురు రైతులు కోరారు. కార్యక్రమంలో రైతులు పవన్, విఠల్, మాణిక్ అప్ప, శంకర్, దత్తు, షైముద్, రాజు, నాగేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

పెర్కిట్, జూన్26 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు బోధించే పద్ధతులపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని నలంద పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు టీచింగ్ మెథడాలజీ, ఆక్టివిటీస్, ప్రాజెక్టువర్క్, స్పీకింగ్, రీడింగ్ అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. మాతృశ్రీ పబ్లిషర్స్ ఏఎం శంకర్, ట్రైనర్లు ఉపాధ్యాయులకు శిక్షణను ఇచ్చారు. నలంద యాజమాన్యం ప్రసాద్, సాగర్ వారిని శాలువాతో సత్కరించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆర్మూర్ రూరల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): వానకాలంలో సోకే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆలూర్ మండల తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో గంగాధర్ అన్నారు. గురువారం ఆలూర్ మండల పరిషత్ కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించి గ్రామంలోని అన్ని మంచినీటి ట్యాంక్‌లను శుభ్రం చేయాలన్నారు. తాగునీటి సరఫరాపై దృష్టి సారించి లీకేజీలు ఏర్పడితే తక్షణమే మరమ్మతులు చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంతోష్, పంచాయతీ కార్యదర్శి , అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షురాలిగా లక్ష్మీనర్సు

జక్రాన్‌పల్లి, జూన్26 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షురాలిగా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామానికి చెందిన మాసం లక్ష్మీనర్సును నియమించారు. గురువారం ఆమెకు నియామక పత్రాన్ని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీదేవి అందజేశారు. జిల్లా అధ్యక్షుడిగా మహిపాల్ యాదవ్, జిల్లా కన్వీనర్‌గా బాపురావ్, గౌరవ అధ్యక్షుడిగా రాజన్న, ఉపాధ్యక్షునిగా జనార్ధన్, ఆర్మూర్ నియోజక వర్గ ఇన్‌చార్జిగా రాజమల్లు యాదవ్, సభ్యులుగా లక్ష్మీనర్సయ్య, మహిళ సభ్యురాలిగా మాజీ ఎంపీపీ మంజూల ప్రకాష్‌యాదవ్, లక్ష్మీ యాదవ్, జిల్లా యూత్ అధ్యక్షులుగా గణేష్‌యాదవ్‌లను నియమించారు.

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఆర్మూర్ రూరల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిపల్లిలో గల మహాత్మజ్యోతిభా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో మిగిలివున్న బీసీ, ఎస్సీ కోట సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరుచూరి అనూష తెలిపారు. ఈ 29వ తేదీలోగా విద్యార్థినులు నేరుగా కళాశాలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 9948192406, 9666352860 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ముప్కాల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా బద్దం నర్సారెడ్డి

ముప్కాల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల బీఆర్ఎస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బద్దం నర్సారెడ్డిని నియమిస్తు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో మండల పార్టీ అధ్యక్షునిగా నియమించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

వైద్య కళాశాలలో మానిటరింగ్ కమిటీ తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యులు

కామారెడ్డిటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి వైద్యకళాశాలలో, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గురువారం మానిటరింగ్ కమిటీ బృందం తనిఖీ చేపట్టారు. ప్రస్తుతం ఉన్న కళాశాల సౌకర్యాలను పర్యవేక్షించి నిర్మాణంలో ఉన్న కళాశాల బిల్డింగ్, హాస్టల్స్ పరిశీలించారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించి లోటుపాట్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీ సిబ్బంది తమకు జీతాలు రావడం లేదని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారి రవీందర్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లడంతో వారికి తగిన న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ సూపరిటెండెంట్ వెంకట్, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడేను డ్రైడేగా పాటించాలి

నవీపేట,జూన్26(ఆంధ్రజ్యోతి): వర్షాకాలానికి సంబంధించి సీజనల్ వ్యాధుల నివారణకు ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి సబ్‌యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్ రావు కోరారు. గురువారం మండల ఐకేపీ కార్యాలయంలో జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారానికి ఒకసారైన నిల్వ ఉన్న నీటిని తొలగించి కొత్త నీటిని నింపుకోవాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీఎం భూమేష్ గౌడ్, మండల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

రైతు మహాసమ్మేళనం పోస్టర్ల ఆవిష్కరణ

నవీపేట,జూన్26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షులు సరిన్ కోరారు. గురువారం రైతు మహాసమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తారని, కార్యక్రమానికి పెద్దఎత్తున రైతులు, ప్రజలు, యువకులు, మహిళలు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాజేందర్ గౌడ్, ఆనంద్, గణేష్, శ్రీకాంత్, రాజశేఖర్, రాము, సందీప్, గోపాల్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమ్‌గల్ , జూన్26 (ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ ద్వారా బీడీ కార్మికుల పిల్లలకు 2025-26 సంవత్సరానికి గాను ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీడీకార్మిక ఆసుపత్రి వైద్యుడు శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు ఆగస్టు 31 వరకు, ఇంటర్ నుంచి డిగ్రీ చదివే పిల్లలకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు కార్మికశాఖ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని, ఇతర వివరాల కోసం భీమ్‌గల్ అయ్యప్పనగర్ కాలనీలోని కార్మిక ఆసుపత్రిలో సంప్రదించాలన్నారు.

నాగాపూర్‌లో గ్రామ దేవతలకు జలాభిషేకం

బాల్కొండ, జూన్26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగాపూర్ గ్రామంలో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. గోదావరి నుంచి జలాలను తీసుకువచ్చి వలగొడుగుతో ఊరేగింపుగా వెళ్లి గ్రామంలోని అన్ని దేవతామూర్తులకు జలాభిషేకం చేసి వర్షాలు సమృద్ధిగా పంటలు బాగా పండాలని పూజలు చేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బస్సు, బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ఆర్మూర్ టౌన్, జూన్26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్ గ్రామంలో ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొని కొటార్మూర్‌కు చెందిన మామిడి మహేష్ (38) అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. గురువారం మహేష్ తన ద్విచక్ర వాహనంపై భార్యను మహిళ ప్రాంగణం దగ్గర దించి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో కరీంనగర్ నుంచి ఆర్మూర్ వైపు వస్తున్న జగిత్యాల డిపో ఆర్టీసీ బస్సు మహేష్ ద్విచక్ర వాహనాన్ని వెనుకనుంచి ఢీ కొన్నదన్నారు. తలకు బలమైన గాయాలై చెవులు, ముక్కు నుంచి రక్తం కారి చనిపోయాడని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

డీవీకేకు ఘన నివాళి

ఆర్మూర్ టౌన్, జూన్26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమార్ నారాయణ భవన్ వద్ద సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో డీవీకే మూడోవర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీకే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కామ్రేడ్ దుర్గంపుడి వెంకట కృష్ణ (డీవీకే) పార్టీకి చేసిన సేవలతో ఆదర్శ విప్లవ కమ్యూనిస్టు నేతగా ప్రజా పంథ పోరాటాలకు పునాది వేసిన ఉద్యమ నిర్మాణకర్తను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని, తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఉద్యమాల వైపు నడిచి కార్మిక సంఘం స్థాపించి అనేక నాయకులకు విప్లవం వైపు నడపాలని, బీడీ కార్మికుల అభ్యున్నతి కోసం జీవనభృతికోసం పోరాటం చేశాడని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బి.దేవారాం, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఎం.ముత్తెన్న, సబ్‌డి విజన్ కార్యదర్శి కిషన్, జక్కం శేఖర్, ఎం. నరేందర్, ఠాకుర్, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన డీసీసీబీ చైర్మన్

వేల్పూర్, జూన్26 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలో బైరి అంజయ్య చిన్న కుమారుడు శ్రీకాంత్, వేల్పూర్‌లో విశ్వబ్రాహ్మణ ప్రభాకర్‌లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డీసీసీబీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి గురువారం మృతుల కుటుంబాల ఇంటికి వెళ్లి పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలిపారు. ఈయన వెంట సొసైటీ వైస్ చైర్మన్ శ్రీధర్, పన్నాల యశ్‌పాల్, సొసైటీ డైరెక్టర్ రాజరపు రాజన్న, పెద్ద హన్మాండ్లు గంగాధర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన అధికారులు

వేల్పూర్, జూన్26 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఎంపీడీవో బాలకిషన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జీపీ కార్యదర్శి విజయ్‌కుమార్‌లు పరిశీలించారు. ఇళ్ల నిర్మాణంలో పనులు వేగవంతం చేయాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం ఉన్నందున ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు బేస్‌మిట్ లెవల్ పూర్తి చేసిన పనులకు లక్ష రూపాయలను లబ్ధిదారుని ఖాతాలో జమచేశామన్నారు. ప్రతీ సోమవారం పనులు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం ద్వారా రూపాయలను వారి ఖాతాలో జమచేశామన్నారు.

మగ్గిడిలో...

ఆర్మూర్ రూరల్ : ఆర్మూర్ మండలం మగ్గిడి, అమ్దాపూర్ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం ఎంపీడీవో బ్రహ్మానందం పరిశీలించారు. మగ్గిడిలో 14 ఇళ్లు మంజూరు కాగా 6 ఇళ్లు పనులు ప్రారంభించారని, అమ్దాపూర్‌లో 23 మంజూరు కాగా 12 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. ఆయన వెంట పంచాయితీ కార్యదర్శులు, గార్మ పంచాయితీ సిబ్బంది ఉన్నారు.

దేగాంలో పరిశీలించిన బీజేపీ నాయకులు

ఆర్మూర్ రూరల్: ఆలూర్ మండలంలోని దేగాం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను గురువారం బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి చొరవతో 3500 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. వాటిలో ప్రతీ ఇంటికి కేంద్ర ప్రభుత్వం రూ. 3 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 2 లక్షలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బస సురేష్, ప్రణీత్‌గౌడ్, రమేష్, జంగం శివ, నరేష్, కేశవ్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

రామారెడ్డి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం శ్రీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక క్యూలైన్ ద్వారా ఆలయ దర్శనాన్ని కల్పిస్తూ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఇంటి నిర్మాణం.. పెను భారం!

● నిర్మాణ సామగ్రి ధరలు పైపైకి ● ధరలు పెరగడంతో ఆందోళన చెందుతున్న గృహ నిర్మాణదారులు



పాతంగల్‌లో సిమెంట్ షాప్ సిమెంట్ స్టాక్



ఇంటి నిర్మాణానికి సిమెంట్ ఇటుకలు



: ఇంటి నిర్మాణానికి అవసరమైన కంకర

కోటగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగానికి ఎంతో అవసరం ఉన్న సిమెంట్, ఐరన్ ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ప్రతి యేటా ఐరన్, సిమెంట్ ధరలు పెరుగుతుండడంతో సామాన్యులకు ఇంటి నిర్మాణం పెను భారంగా మారుతోంది. దీంతో పాటు పోటాపోటీగా ఇసుక, కూలీలు, మేస్త్రీల ధరలు సైతం పెరుగుతుండడంతో ఇంటి నిర్మాణం పెను భారంగా మారుతుంది. కొందరు అప్పులు చేసి ఇళ్లు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మరి కొందరు ధరల పెరుగుదలతో మధ్యలోనే ఇంటి నిర్మాణాలు నిలిపివేస్తున్నారు. పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కల కలగా మిగిలిపోయే పరిస్థితి నెలకొంటుంది.

● ఐరన్, సిమెంట్ ధరలు పైపైకి..

ఇళ్లు నిర్మించాలంటే సిమెంట్, ఐరన్ తప్పనిసరి. సిమెంట్, ఐరన్ ధరలు ప్రస్తుతం మార్కెట్లో ఆకాశన్నంటుతున్నాయి. గత యేడాది అక్టోబర్ నెలలో సిమెంటు బస్తా 250రూపాయల నుండి 300రూపాయలకు పెరిగింది. ప్రస్తుతం సిమెంట్ ధర 330నుండి 360వరకు ఉంది. ఏకంగా ఏడాది కాలంలోనే సిమెంట్ ధర సుమారుగా వంద రూపాయల వరకు పెరిగింది. అలాగే సిమెంట్ టీపీసీ, ఓపీసీ గ్రేడ్ ఆధారంగా ధరలు పలుకుతున్నాయి. టీపీసీ కంటే ఓపీసీ సిమెంట్ బస్తాకు ఆయా కంపెనీల నుండి 40నుండి 50రూపాయల వరకు ధర ఎక్కువగా ఉంటుంది. అలాగే సిమెంట్‌తో పాటు ఐరన్ ధరలు సైతం ఆకాశన్నంటుతున్నాయి. గత యేడాది ఐరన్ ధర టన్నుకు ఆయా కంపెనీలను బట్టి 51వేల రూపాయల నుండి 53వేల రూపాయల వరకు ఉండగా ప్రస్తుతం టన్నుకు 60వేల నుండి 62వేల రూపాయల వరకు పలుకుతుంది. ఒకేసారి టన్ను ధర 8వేల రూపాయల నుండి 9వేల రూపాయలకు పెరగడంతో నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నిర్మాణరంగంలో ఎక్కువగా సిమెంట్, ఐరన్‌ను ముడి సరుకుగా ఉపయోగిస్తారు.



పిల్లర్ల స్థాయిలో ఉన్న ఇంటి నిర్మాణం



ఇంటి నిర్మాణానికి అవసరమైన స్టీల్

● పెరిగిన ఇసుక, ఇతర సామగ్రి ధరలు

ఇంటి నిర్మాణ రంగంలో సిమెంట్, ఐరన్‌తో పాటు ఇసుక సైతం ఎంతో అవసరం. గత యేడాది ట్రాక్టర్ ఇసుక 2వేల లోపు ఉండగా ప్రస్తుతం దూర భారాన్ని బట్టి 2500 నుండి 3500రూపాయల ధర పలుకుతుంది. ఏకంగా ట్రాక్టర్ లోడ్‌కు వెయ్యి రూపాయల నుండి రెండు వేల రూపాయల వరకు ధర పెరిగింది. అలాగే ఇంటి నిర్మాణానికి ఉపయోగించే ఇటుకలు, టైల్స్ మార్బుల్స్, కలర్స్, వీపీసీ పైపులకు సైతం ధరలు పెరిగాయి. అలాగే టేకు దార్వాజాలు, తలుపులు, కిటికిల ధరలు సైతం పెరగడంతో సామాన్యులు ఇల్లు కట్టాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నిర్మాణం చేపట్టే క్రమంలో సుమారు 20లక్షల రూపాయలతో ఇంటి నిర్మాణం పూర్తవుతుందని పనులు చేపడుతుండగా మరో 10లక్షల వరకు అదనంగా ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు ఇంటి నిర్మాణం చేపట్టే మేస్త్రీలు, కూలీల ధరలు సైతం పెరిగాయి. దీంతో ఇంటి నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు.

● ధర పెరగడంతో వ్యాపారం తగ్గింది

భీంరావు, సిమెంట్ వ్యాపారి, పాతంగల్



ప్రస్తుతం సిమెంట్ ధరలు బ్రాండ్‌ను బట్టి బస్తాకు 80రూపాయల వరకు పెరిగింది. ధరలు పెరగడంతో కొనుగోళ్లు పడిపోయాయి. సిమెంట్ క ంపెనీలు లోడ్ బుకింగ్ చేసుకున్న వెంటనే డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నాయి. దీనికి తోడు స్టీల్ ధరలు కూడా పెరగడంతో వ్యాపారం తగ్గింది.

● ఇంటి నిర్మాణం భారంగా పెరిగింది

నీరడి శంకర్, గృహ నిర్మాణదారుడు



సొంతింటి కల నెరవేర్చుకోవడం భారంగా మారింది. సిమెంట్ ధరలు, స్టీల్ ధరలు, మేస్త్రీ, కూలీల ధరలు పెరగడంతో ఆర్థికంగా భారం పడుతుంది. ప్రభుత్వం ధరలు నిర్ణయిస్తే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది.

● ఉమ్మడి మండలంలో 700 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

కోటగిరి మండలంలో 320 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 150 ఇళ్ల నిర్మాణం ప్రారంభమైంది. వీటిలో 14ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్, నాలుగు ఇళ్లు రూప్ లెవెల్ పూర్తయ్యాయి. పొతంగల్ మండలంలో 377ఇళ్లు మంజూరు కాగా బేస్‌మెంట్ లెవెల్‌లో 176ఇళ్లు ఉన్నాయి. 22ఇళ్లకు బిల్లులు చెల్లించారు. ఇంటి నిర్మాణం భారంగా మారుతుందని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ధరలు, కూలీల కొరత, మేస్త్రీల కొరతతో ఇంటి నిర్మాణంపై అదనపు భారం పడుతుందని వాపోతున్నారు. దీంతో ఇంటి నిర్మాణం పెను భారంగా మారుతుందని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఏపీ సీఎంను కలిసిన టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ యాదాగౌడ్



చంద్రబాబును కలిసిన దేగాం యాదాగౌడ్

సుభాష్‌నగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ దేగాం యాదాగౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని సెక్రెటరియేట్‌లో గురువారం చంద్రబాబును కలిసి తెలంగాణలో తెలుగుదేశం పార్టీపై చర్చించారు. ఈ సందర్భంగా దేగాం యాదాగౌడ్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీని నమ్ముకుని పనిచేస్తున్నామని, కార్యకర్తల భవిష్యత్తుపై ఆలోచించాలని కోరారు. జిల్లాలో గ్రామ, మండల కమిటీలు వేశారా అని చంద్రబాబు ఆరా తీయగా అన్ని కమిటీలు ఇప్పటికే వేశామని తెలిపారు. తెలంగాణ ప్రజలు టీడీపీ పార్టీని ఖచ్చితంగా ఆదరిస్తారని తెలిపారు. చంద్రబాబు సాను కూలంగా స్పందించారని త్వరలో తెలంగాణ ముఖ్యనేతలతో సమావేశం ఏర్పాటు చేసుకొని చర్చిద్దామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బీర్కూర్‌లో వారాహి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



బీర్కూర్‌లో వారాహి అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

బీర్కూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని జోడు లింగేశ్వర ఆలయ సన్నిధిలో గురువారం వారాహి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. జూన్ 26 నుండి జూలై 4 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని పంతులు తెలిపారు. మొదటి రోజున అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పూజ, హోమాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ తొమ్మిది రోజులు భక్తులు వారాహి దేవిని విశేషంగా పూజించి, ఆశీస్సులు పొందుతారు. వారాహి నవరాత్రి విశేషాల గురించి అర్చకుడు భక్తులకు వివరించారు. ఈ తొమ్మిది రోజులు వారాహి దేవికి అంకితం చేయాలన్నారు. భక్తులు అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించి, తమ కష్టాలను తొలగించాలని కోరుకోవాలన్నారు. అమ్మవారు భక్తుల కష్టాలను తొలగించడంతో పాటు సకల శుభాలు, ఐశ్వర్యాలు కలిగిస్తుందన్నారు.

పెరుగుతున్న నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం

● ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరుతుండడంతో చిగురిస్తున్న రైతుల ఆశలు
● ప్రస్తుతం నిజాంసాగర్‌లో 5.203 టీఎంసీల నీటి నిల్వలు
● మంజీరాకు వెంటనే 1025 క్యూసెక్కుల నీరు రాక



నిజాంసాగర్‌లోకి కొత్త నీరు వచ్చి చేరుతున్న దృశ్యం

నిజాంసాగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాల వరప్రదాయిని నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి బుధవారం ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు మంజీరా నది వెంట వరద నీరు వచ్చి చేరుతూనే ఉంది. దీంతో ప్రాజెక్టు నీటి నిల్వలు క్రమేపాన పెరుగుతున్నాయి. నిజాంసాగర్ స్థాయికి లోనికి ఎగువ నుంచి 1025 క్యూసెక్కుల వరద నీరు వస్తూనే ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 1405 అడుగులు కాగా ప్రస్తుతం 1392.408 అడుగుల నీటి సామర్థ్యానికి చేరుకుంది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా ప్రాజెక్టులో ప్రస్తుతం 5.203 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నా యి. ఈ నెల 18వ తేది నుంచి బోధన్, నిజామాబాద్ పట్టణాలకు తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తున్న విషయం తెలిసింది. ఏడాది వర్షాకాలం ప్రాజెక్టు నీటి విడుదల ఇరిగేషన్ అధికార యంత్రాంగం ఇప్పటికీ ఖరారు చేయలేక పోయింది. ఈ ఏడాది ఇప్పటికే రైతులు 1,35,000 ఎకరాల్లో వరి నాట్లు వేసుకునేందుకు సమా యాత్తమయ్యారు. ప్రాజెక్టు నుంచి బోధన్, నిజామాబాద్ పట్టణాలకు తాగునీటి కోసం 0.35 టీఎంసీల నీటిని విడుదల చేస్తామన్న అధికారులు ఇప్పటి వరకు ప్రాజెక్టు ద్వారా ఒక టీఎంసీ నీటిని విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి వరద నీటిని నేరుగా సాగు గేట్ల ద్వారా ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ఈ వి డుదలయ్యే నీరు తాగునీటి అవసరాలకు, ఆయకట్టు కింద వరి నాట్లు వేసుకునేందుకు నీటిని విడుదల చేస్తున్నారా ప్రశ్నార్థకంగా మారింది. బుధ, గురువారాల్లో కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్ క్యాచ్ మెంట్ ఏరియాల నుంచి వరద నీరు వస్తూ ఉండడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరుగుతూ ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభమై 20 రోజులు గడిచిన వర్షాలు కురియకపోవడంతో రైతులు ఆందోళన చెందారు వర్షుడు కరుణించడంతో వర్షాలు కురియడంతో నిజాంసాగర్ ఆయకట్టు రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. ఏడాది నిజాం సాగర్ ప్రాజెక్టు నిండి ఆయకట్టు కింద సిరులు పండుతాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ సదస్సుకు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు

● సిర్పూర్ గుట్ట 830 సర్వేలో భూమి ఉందని అనేక మంది దరఖాస్తు



సిర్పూర్ గుట్ట

మోపాల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరానికి కూత దూరంలో ఉన్న సిర్పూర్ గుట్టపై అందరి చూపు పడింది. ఇటీవల ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించిన విషయం అందరికీ తెలిసిందే. గతంలో స్వర్గీయ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో అనేక మందికి భూపంపిణీ చేసిన విషయం తెలిసిందే. అనేక మందికి పట్టాలు ఇచ్చినప్పటికీ భూమి చూపలేకపోయారు. పట్టాలను అడ్డం పెట్టుకొని కొంత మంది బ్యాంకుల్లో రుణాలు కూడా తీసుకున్నారని చర్చనీయాంశమైంది. భూమి తప్ప పట్టాలు ఎక్కువ కావడంతో ఇప్పుడున్న అధికారులు తర్జన బర్జన పడుతున్నారు. 830 సర్వే నెంబర్‌లో తమకు భూమి ఉందంటూ తమకు భూమి ఉందని చెప్పుకుంటున్నారు తప్ప భూమి ఎక్కడుందో తెలియక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. భూమి లేనిది పట్టాలు ఎలా వచ్చాయని రెవెన్యూ అధికారులే ఆశ్చర్యపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పట్టాలున్న వారు భూమి తమకు లేదని ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు అనేక మంది దరఖాస్తులు చేసుకోవడంపై మండలంలో చర్చనీయాంశమైంది. మండలంలోని సిర్పూర్, ముదక్‌పల్లి, కాల్పోల్, బైరాపూర్, ఎల్లమ్మకుంట, తదితర ప్రాంతాల నుంచి అనేకమంది దరఖాస్తులను చేసుకున్నారు. ఈ విషయమై తహశీల్దార్ రామేశ్వర్‌ను అడుగగా దరఖాస్తులు చేసుకున్నంత మాత్రన సరిపోదని అన్ని విచారించిన తర్వాతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడం అందరి హక్కు అని పేర్కొన్నారు.

మెడికల్ కళాశాలలో లీకేజీల పర్వం

● వర్షం పడితే లీకేజీలు

నిజామాబాద్ అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల సమస్యలతో సతమతమవుతుంది. జిల్లాలో 2013-14 విద్యాసంవత్సరంలో జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ప్రారంభించారు. జిల్లా కేంద్ర ఆసుపత్రికి నూతన భవనాన్ని నిర్మించగా పాత ఆసుపత్రి భవనాన్ని మెడికల్ కళాశాలకు కేటాయించారు. 1998లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసి 2002లో ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించారు. ప్రస్తుతం ఆ భవనంలో మెడికల్ కళాశాల కొనసాగుతుండగా నిర్మించి 23 ఏళ్లు అయిన ఆ భవనంలో ఇప్పుడే లీకేజీలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్‌నాయక్ గురువారం జిల్లా కేంద్ర ఆసుపత్రితో పాటు మెడికల్ కళాశాలను తనిఖీ చేసి అ క్కడి వసతులను మెరుగుపరిచేందుకు వివరాలు తెలుసుకున్నా రు. ఆయన పర్యటించిన సందర్భంగా వర్షపునీరు మెడికల్ కళాశాల లో లీకేజీ అవుతున్న దృశ్యాలు కనిపించాయి. వర్షపు నీరు ఫ్లోర్ మీద పడకుండా సిబ్బంది బకెట్లను అడ్డుపెట్టడం కళాశాలలో చాలా చోట్ల కనిపించింది. పురాతన భవనం కావడంతో భవనంలో వసతులు అంతంత మాత్రం గానే ఉన్నాయి. సీలింగ్ కూడా చాలా చోట్ల ఊడిపోయింది. గోడలు సైతం తేమ వచ్చి పెచ్చులూడడం పలుచోట్ల కనిపించింది. 23 ఏళ్ల పురాతన భవనంలో కొనసాగుతున్న మెడికల్ కళాశాలను ఇప్పటికైనా అధికారులు మెరుగైన వసతులు కల్పించాలని వైద్య విద్యార్థులు కోరుతున్నారు.



మెడికల్ కళాశాలలో లీకేజీలకు బకెట్లను పెట్టిన సిబ్బంది



ఫొటోన్యూస్

మెడికల్ కళాశాల



ఊడిపోయిన సీలింగ్





వర్షం కురవాలని కప్పతల్లి ఆట



రామారెడ్డి మండల కేంద్రంలో వర్షం పడాలని కప్పతల్లి ఆటలాడుతున్న మహిళలు

రామారెడ్డి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా గ్రామాల్లో వర్షాలు కరువయ్యాయి. దీంతో వర్షం పడాలని కోరుతూ గ్రామాల్లో, తండాల్లో కప్పతల్లి ఆటలు ఆడుతూ మహిళలు పాటలు పాడుతున్నారు. గ్రామాల్లో వీధుల గుండా ఇంటింటికీ తిరుగుతూ వర్షాలు పడాలని కోరుతూ పాటలు పాడుతూ ప్రజలను కనువిందు చేస్తున్నారు. ఇంటింటికి తిరు గడంతో వర్షాల మీద పాటలు వింటూ కప్పతల్లిపై నీళ్లు పోస్తూ దేవుళ్లకు మొక్కులు మొక్కుతున్నారు. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్, అన్నారం, పోసానిపేట్, కన్నాపూర్, గొల్లపల్లి, గిద్ద, మద్దికుంట, ఇసన్నపల్లి, సింగిరాయిపల్లి తదితర గ్రామాల్లో, తండాల్లో గురువారం వివిధ రకాల పాటలు పాడుతూ నృత్యం చేశారు. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ప్రసిద్ధిగాంచిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయం, శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి, మద్దికుంట గ్రామ శివారు అడవి ప్రాంతంలో ఉన్న శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి, పోసానిపేట్ గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వ రాలయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కప్పతల్లి ఆటలు, పాటలు పాడుతున్న మహిళలకు డబ్బులు, బియ్యాన్ని దానం చేశారు. వర్షాలు సకాలంలో పడితే పంటలు బాగా పండుతాయని గ్రామాల్లో, తండా ల్లో గ్రామాల దేవుళ్లకు, దేవతలకు ప్రత్యేక పూజ లు, వంటలు చేస్తూ వన భోజనాలు చేసుకుంటు న్నారు. వర్షాకాలంలో వర్షాలు పడి పంటలు బాగా పండాలని ప్రజలు దేవుళ్లకు కోరుతున్నారు..

ఉపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య : పీఆర్‌టీయూ



ఉపాధ్యాయుడిని కలిసిన పీఆర్‌టీయూ నాయకులు

కామారెడ్డిటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని హనుమాన్ మందిర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఎస్జీటీ ఉపాధ్యాయుడు బాలకృష్ణపై విద్యార్థి తండ్రి దాడిచేయడం హేయమైన చర్య అని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం ఉపాధ్యాయుడు బాలకృష్ణను కలిసి జరిగిన ఘటనపై ఆరా తీశారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై చేయి చేసుకోవడం మూర్ఖత్వం అని అన్నారు. సంఘం ఎల్లప్పుడు ఉపాధ్యాయులకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అసిస్టెంట్ అధ్యక్షుడు గోవర్ధన్, సుధాకర్, బిల్య, విష్ణువర్ధన్, వివిధ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రధానకార్యదర్శికి సన్మానం



ఇంద్రకరణ్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

భిక్కనూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రధానకార్యదర్శిగా నియామకమైన బద్దం ఇంద్రకరణ్ రెడ్డిని ఎంపీ సురేష్ షెట్కార్, ఏఐసీసీ సెక్రెటరి విష్ణునాథన్, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పార్టీని బలోపేతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తా : సీఐ



సీఐ నరహరి

కామారెడ్డిటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పట్టణ సీఐ నరహరి తెలిపారు. గురువారం కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో నూతన ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పోలీసుస్టేషన్‌లో సిబ్బందిని సమన్వయం చేస్తూ ప్రజలకు మంచి సేవలను అందిస్తానని తెలిపారు. కాగా ఇదివరకు ఇక్కడ పనిచేసిన సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సిద్దిపేట జిల్లాలోని ఇంటెలిజెన్స్ సీఐగా వెళ్లారు.

యాదవ సంఘం రాష్ట్ర నేతలను కలిసిన జిల్లా నాయకులు



రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న జిల్లా నాయకులు

కామారెడ్డిటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి):అఖిల భారత మహాసభ యాదవసంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చింతల రవీందర్‌ను నూతనంగా ఎన్నుకోవడంతో జిల్లా అధ్యక్షుడు అర్కల ప్రభాకర్‌యాదవ్ ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా యాదవ్‌ల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు. మంత్రివర్గంలో యాదవ్‌లకు చోటు, యాదవకార్పొరేషన్ తదితర సమస్యలపై పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వాసుయాదవ్, యూత్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

దోమకొండలో ఫిజియోథెరపీ శిబిరం



దోమకొండలో ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహిస్తున్న వైద్యులు

దోమకొండ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరాం మందిర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గల భవిత సెంటర్‌లో గురువారం ఫిజియోథెరపి శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు వైద్యుడు ఫిజియోథెరపీ చికిత్సలు చేశారు. అనంతరం వైద్యుడు విద్యార్థుల తల్లిదండ్రులకు శిక్షణ కల్పించారు. ఈ మేరకు వైద్యుడు మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థులకు స్పీచ్‌థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పన్యాల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రభావతి, సంతోష్‌కుమార్, ప్రత్యేక ఉపాధ్యాయుడు నాగరాజు, ఐఈఆర్పీ దామోదరచారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు



మండలంలోని బస్వాపూర్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

భిక్కనూరు, జూన్26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్ గ్రామంలో జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురి నుంచి హైపర్‌టెన్షన్, టీబీ, డయాబెటీస్, సుఖవ్యాధులు, హెచ్‌ఐవీ వ్యాధుల నిర్ధారణకు రక్తనమునాలు సేకరించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణీ యేమిమా మాట్లాడుతూ ఉచిత సమగ్ర వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు అంకిత, పూజ, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

సనాతన ధర్మం కోసం అఖండ రామజ్యోతి పాదయాత్ర

కామారెడ్డిటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం, హిందూ ఐక్యత కోసం అఖండ రామజ్యోతి పాదయాత్ర చేస్తున్న లేక్‌రామ్ స్వామిజీ గురువారం కామారెడ్డి పట్టణానికి చేరుకున్నారు. మార్చి 22న కన్యాకుమారిలో యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. ఈ యాత్ర ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య క్షేత్రం వరకు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, కార్యదర్శి బోలిరాజులు స్వామిజీని కలిశారు.

'ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు

కామారెడ్డిటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని కేంద్ర సంఘ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులకు సంబంధించి ఈహెచ్‌ఎస్, పాతపెన్షన్ విధానం పునరుద్ధరణపై సంఘం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, జిల్లాలో పంచాయతీ సెక్రటరీలు పడుతున్న ఇబ్బందులను తీర్చాలని అన్నారు. ఆర్థికంగా పంచాయతీ కార్యదర్శులు అనేక ఇబ్బందులు పడుతూ గ్రామపంచాయతీల నిర్వహణ చేపడుతున్నారని తెలిపారు. వీఆర్వోలు సీనియార్టీకి సంబంధించిన విధివిధానాలు లేనందున వాటిపై ప్రభుత్వంతో చర్చించాలని, సంక్షేమహాస్టల్లో నెలకొన్న సమస్యలు, కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలలో మున్సిపాలిటీ హెచ్‌ఆర్‌ఏను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగరాజు, సంయుక్త కారదర్శి అబ్దుల్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏ చెక్‌పోస్టులు.. వసూళ్లకు అడ్డాలు !

(5వ పేజీ తరువాయి)

ఆర్టీఏ చెక్‌పోస్టు ముందుగానే నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలతో అక్రమ రవాణా జరుగుతున్నా ఆర్టీఏ అధికారులు ముడుపులు పుచ్చుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి సరుకులను ఎలాంటి బిల్లులు లేకుండా చెక్‌పోస్టుల మీదుగా దిగుమతి చేసుకుంటున్నప్పటికీ ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేయడం లేదు. జిల్లాలో పలు వ్యాపారులు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్దమొత్తంలోనే పప్పు దినుసులతో పాటు ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వస్తువులను దిగుమతి చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏ సరుకులనైనా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తీసుకువెళ్లాలంటే బిల్లులు, వే బిల్లులు తప్పనిసరి. ఆ వాహనాలకు ఇవేవి లేకున్నా ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద అధికారులు ముడుపులు తీసుకుంటూ రైట్‌రైట్ అంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీంతో సరిహద్దులు దాటి అక్రమ సరుకుల రవాణా జోరుగా సాగుతోంది. ప్రభుత్వానికి పన్ను రూపేనా రావాల్సిన లక్షలాది నిధులకు గండిపడుతోంది.

సీజనల్ వ్యాధులపై అవగాహన



లింగంపేటలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

లింగంపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సీజనల్ వ్యాధులపై మహిళా సంఘాలకు సీజనల్ వ్యాధులు, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపీడీవో నరేష్ అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్లలో నీటిని ఎక్కువ రోజుల వరకు నిల్వ ఉంచుకోవద్దని, ఇంటి ఎదుట మురికి గుంతలు ఉంటే తొలగించుకోవాలని ఆయన సూచించారు. మహిళా సంఘాలకు అప్పగించిన విద్యార్థుల యూనిఫాంలపై మహిళా సంఘాల అధ్యక్షులను వివరాలు సేకరించారు. యూనిఫాంలు త్వరగా కుట్టి విద్యార్థులకు అందజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మలహరి, ఏపీఎం శ్రీనివాస్‌లతో పాటు వివిద గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షులున్నారు.

ఎల్లారెడ్డి : సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రజలకు పలు ఆరోగ్య వ్యక్తిగత జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, హెల్త్‌సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామీణ ప్రజలకు పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలని పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, హెల్త్ సిబ్బంది గ్రామాలలో ప్రజలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు ఆరోగ్య సిబ్బంది ఏపీవో వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ బుక్ రికార్డు సాధించిన రెండేళ్ల బాలుడు



బాలుడితో తల్లిదండ్రులు

ఎల్లారెడ్డి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాల మూడు నెలల బాబు ప్రపంచ బుక్ రికార్డు సాధించాడు. ఎల్లారెడ్డి మాజీ ఎంపీపీ బీజేపీ నాయకులు నక్కగంగాధర్ కూతురు అమూల్య కుమారుడు గురువారం ప్రపంచ బుక్‌రికార్డు సొంతం చేసుకున్నాడు. వియన్ వయసు రెండేళ్లు. తనకున్న మేధస్సుతో భారతీయ రాష్ట్రాల రాజధానులను, 29 రాష్ట్రాలు, వాటి రాజధానుల పేర్లను కేవలం 41 సెకండ్ల వేగంతో సమాధానం ఇచ్చి ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డు లోకి ఎక్కాడు. దీంతో కుటుంబ సభ్యులు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ హయాంలో కాంట్రాక్టర్లను వేధించారు

● ఎల్లారెడ్డి కాంగ్రెస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో కాంట్రాక్టర్లను నాయకులు వేధించారని ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బస్టాండ్, డబుల్ బెడ్‌రూమ్‌లు, మినీట్యాంక్‌బండ్ పనులు చేయాలంటే అప్పటి నాయకుల కమీషన్ల వేధింపులను తట్టుకోలేక కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రుల వద్దకు వెళ్లి నిధులు మంజూరు చేయించారన్నారు. ఆయనతో పాటు మండల అధ్యక్షుడు సాయిబాబా, అజార్ ఖాద్రి, శ్రీనివాస్, ప్రకాష్, గఫర్, సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

'బిచ్కుంద పట్టణ అభివృద్ధిపైనే ఎమ్మెల్యే దృష్టి'

బిచ్కుంద, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బిచ్కుంద పట్టణ అభివృద్ధిపైనే జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దృష్టిసారించి నిధులకు కృషిచేసినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగాధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిచ్కుంద అభివృద్ధిలో భాగంగా సెంట్రల్ లైటింగ్ పనులకు రూ.12 కోట్లు మంజూరు చేయించి పనులు కొనసా గుతుంటే బీజేపీ శ్రేణులు రాస్తారోకో ధర్నా చేయడం సమంజసం కాదన్నారు. బిచ్కుంద పట్టణాన్ని మున్సిపాలిటీగా ప్రభుత్వం గెజిటెడ్ నోట్ అభివృద్ధికి రూ.15 కోట్లు, అలాగే పట్టణం లోని సీసీరోడ్ల కోసం కోట్ల రూపాయలతో పనులు పూర్తి అవడమే కాకుండా అనేక పను లకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అభివృద్ధిలో ప్రతిపక్ష నాయకులు భాగస్వాములై సలహాలు, సూచనలు చేసి సహకరించాలని, అంతే కాని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అసత్యకార్యక్రమాలు చేపట్టరాదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నౌషానాయక్, అశోక్, సాహెల్‌షెట్కార్, నాగనాథ్, జాలిల్, తు కారం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



భిక్కనూరులో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

భిక్కనూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే పార్టీ కాంగ్రెస్ అని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమజేయడం పై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం భిక్కనూరు మండల కేంద్రంలోని పాత జాతీయరహదారిపై సినిమా టాకీసు చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల రాజారెడ్డి, కుంట లింగారెడ్డి, లింబాద్రి, బల్యాల సుదర్శన్, నర్సింహారెడ్డి, భూమయ్య, శ్రీరాం వెంకటేష్, నరేందర్‌రెడ్డి, స్వామి, జీవన్ పాల్గొన్నారు.

తాడ్వాయి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూగంటి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీడీసీ మాజీ చైర్మన్ మద్దిమహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ అంబీర్ శ్యామ్ రావు, అధికార ప్రతినిధి మహమ్మద్ షౌకత్ అలీ, మాజీ సర్పంచ్ బండారి సంజీవ్, సీనియర్‌నాయకులు ప్రతాపరెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

పాల్వంచలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం



భవానీపేట్ తండాలో సేవాలాల్ మందిరం పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మాచారెడ్డి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలంలోని భవానీపేట్ తండా, సింగరాయిపల్లి, ఇసాయిపేట్, మంథని దేవునిపల్లి, వేల్పుగొండ, వాడి గ్రామాల్లో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయాగ్రామాల్లో తన సొంత నిధులతో నిర్మించిన కుల సంఘాల భవనాలు, ఆలయాలతో పాటుగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారం భించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్య క్షుడు పోసు అనీల్, నాయకులు పండ్ల ప్రవీణ్, బూన సురేష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

లింగంపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒంటర్‌పల్లికి చెందిన రాపర్తి శ్రీకాంత్(22) గురువారం ఇంట్లో నైలాన్‌తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని తండ్రి సాయిలు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్‌రావు తెలిపారు. శ్రీకాంత్ ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడన్నారు. ఆ అమ్మాయి మేనమామ సంతోష్ మరోసారి అమ్మాయిని కలిసినా, మాట్లాడినా శ్రీకాంత్‌ను చంపేస్తానని బెదిరించడం, దూషించడంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్నట్లు పిర్యాదులో తెలియజేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వర్షాల కోసం గ్రామ దేవతలకు పూజలు

బిచ్కుంద, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పంటలు బాగా పండాలంటే దైవానుగ్రహం రైతులపై ఉండాలని బిచ్కుంద మఠాధిపతి సోమలింగ శివచార్య మహాస్వామిజీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కమ్మరి గుడి శివాలయంతో పాటు గ్రామదేవతలకు రైతులందరూ జలాభిషేకం చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన



నిరసన తెలుపుతున్న టీయూసీఐ నాయకులు, కార్మికులు

కామారెడ్డిటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మూడునెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ వర్కర్ల జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తు కామారెడ్డి కలెక్టరేట్ వద్ద టీయూసీఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీయూసీఐ రాష్ట్రనాయకుడు ఆర్.రమేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వర్కర్ల జీవోనంబర్ 60 ప్రకారం జీతాలు పెంచి పెండింగ్ వేతనాలు ఇవ్వాలని గ్రీన్‌చానల్ ద్వారా ప్రతి నెల జీతాలు ఇవ్వాలని జీవోనంబర్ 51 రద్దుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రీన్‌చానల్ ద్వారా కార్మికుల అకౌంట్లలో జీతాలు వేయాలని వారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు పర్మినెంట్ చేయాలని ఉద్యోగభద్రత కల్పించాలని, ఇన్సూరెన్స్ గ్రాటివిటీ డ్యూటీ చట్టాలు అమలు చేయాలని కార్మికుల సంఖ్యను పెంచాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జయ ప్రకాష్, గ్రామపంచాయతీ వర్కర్లు రాజు, రమేష్, నర్సింలు, గంగారాజు, రాజు, శ్యామల, రాజు, లింగం తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతోనే గ్రామానికి రక్ష



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ

గాంధారి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు ఎంతో అవసరమని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం గాంధారి మండలంలోని పెద్ద గుజ్జల్ తండాలో సీసీ కెమెరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సదాశివనగర్ సీఐ సంతోష్, గాంధారి ఎస్ఐ ఆంజనేయులు, వసంతరావు, దేవిసింగ్, ప్రేమ్‌సింగ్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

గాంధారి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలో కల్యాణలక్ష్మీ చెక్కులను గురువారం మండలంలోని చద్మల్‌తండాలో 6 చెక్కులను, నేరల్ గ్రామంలో 7, నాగులూర్ తండాలో 2, నేరల్ తండాలో 6 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పరమేష్ మాట్లాడుతూ చెక్కులను గ్రామాల్లో పంపిణీ చేయాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తెలిపారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రేణుకచౌహన్, ఏఎంసీ వైస్‌చైర్మన్ లక్ష్మన్, మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్, మాజీ ఎంపీటీసీ తూర్పురాజులు, సింగసాని శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రాములు, శ్రీకాంత్‌రెడ్డి, గణేష్, బాబా పాల్గొన్నారు.

రామారెడ్డి తహసీల్దార్, ఎస్సైలకు సన్మానం

రామారెడ్డి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి తహసీల్దార్ ఉమలత, ఎస్సై రాజారాంను ఇండియా బంజారా సేవా సంఘం మండల నూతన కమిటీ బృందం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాంచందర్ నాయక్, జిల్లా సీనియర్ నాయకులు రెడ్డి నాయక్, గంగవత్ పెంటయ్య నాయక్, ప్రధానకార్యదర్శి సంతోష్ నాయక్, కోశాధికారి రవినాయక్, గౌరవ అధ్యక్షులు సర్మన్ నాయక్ పాల్గొన్నారు.

10 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

బీర్కూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాపూర్ గ్రామ శివా రులోని డంపింగ్ యార్డులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 10 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి 8 వేల 300 రూపాయల నగదు, 8 సెల్ ఫోన్లు, ఏడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలి పారు.

44 మంది వాహనదారులకు జరిమానాలు

బీర్కూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మంజీరాకు వెళ్లే రహదారిలో గురువారం ఎస్సై రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. రోడ్డు నిబంధనలు పాటించని, సరైనపత్రాలు లేని 44 మంది వాహనదారులపై జరిమానాలు విధించినట్లు పోలీసులు తెలిపారు.

వచ్చే మార్చి నాటికి 22.50 కోట్ల రుణాలు అందించాలి

బీర్కూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో గురువారం మహిళా సమాఖ్య మండల సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. 2026 మార్చి వరకు 22 కోట్ల 50 లక్షల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాలని లక్ష్యం ఉందని, అందుకు అనుగుణంగా రుణాలు అందించాలని ఐకేపీ ఏపీఎం గంగాధర్ మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, మహిళలు ఉన్నారు.

అధికారిని దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అధికారిని దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రకాష్‌ను లింగంపేట మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన బేగరి సాయిలు అనే వ్యక్తి కళ్యాణ లక్ష్మి పథకం కోసం వివాహ ధ్రువీకరణ పత్రలపై గెజిటెడ్ సంతకం కోసం వెళ్లారు. దీంతో సంబంధిత ధ్రువపత్రాలు పరిశీలించి సంతకం చేస్తానని తెలుపగా, సాయిలు అశ్లీల పదజాలంతో దూషించాడని ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రకాష్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామ శివారులో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. భిక్నూర్ మండలం లక్ష్మీదేవీపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు లావణ్య, రమేశ్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. రమేశ్ తన భార్య లావణ్యతో కలిసి కారులో కొండాపూర్ గ్రామానికి వెళుతుండగా రాచర్లగొల్లపల్లి గ్రామ శివారులో అదుపు తప్పింది. అతి వేగం వల్ల వాహనం నుజ్జునుజ్జయింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

భవానిపేట్‌లో ఆరు ఇళ్లల్లో చోరీ

మాచారెడ్డి, జూన్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని భవానిపేట్‌లో గురువారం తెల్లవారుజామున ఆరు ఇళ్లల్లో చోరీ జరిగినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. దొంగలు ఆరు ఇళ్లలో చొరబడి బీరువాలను పగులగొట్టి మూడు తులాల బంగారు ఆభరణాలు, 70తులాల వెండి ఆభరణాలు, రూ.70వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.